చేతి పంపునకు మరమ్మతులు

చేతిపంపునకు మరమ్మతులు చేయిస్తున్న ఈవో సంజీవరావ్

చేతిపంపు చుట్టు నిర్మించిన సిమెంట్ బేస్‌మిట్

నమస్తే ఎఫెక్ట్

ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొడ్డిగూడలోని కొలాం ఆదివాసీ గిరిజనులకు కలుషిత నీరే దిక్కు అని నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఇంద్రవెల్లి పంచాయతీ ఈవో సంజీవరావ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో పాటు కార్మికులు 15 మంది బొడ్డిగూడ గ్రామాన్ని సందర్శించారు. కలుషిత నీటిలో ఉన్న చేతిపంపునకు మరమ్మతులు చేసి కొత్త రింగుల వేసి ప్రత్యేకంగా గద్దెను నిర్మించి హ్యాండిల్‌ను అమర్చారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన బోర్ ఉందని, దానికి మరమ్మతులు చేసి గ్రామానికి నీరు అందించడానికి ప్రణాళిక చేశామన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ శ్రీనివాస్‌తో పాటు ఏఈ భానుకుమార్ బొడ్డిగూడ గ్రామాన్ని సందర్శించారు. ఇక్కడ జేపీ బిల్ కలెక్టర్ గంగారాం, పంచాయతీ సిబ్బంది శంకర్‌లాల, నారాయణ పాల్గొన్నారు.

- ఇంద్రవెల్లి, జూలై 29

జాతీయ రహదారిపై లారీ బోల్తా

నీతాగోంది దగ్గర జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

గుడిహత్నూర్, జూలై 29 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగొంది బ్రిడ్జి సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. నిర్మల్ వైపు నుంచి కార్డ్‌బోర్డు ఫర్నిచర్ సామగ్రి లోడ్‌తో వస్తున్న లారీ టైర్ పగలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

దస్తురాబాద్,జూలై 29 : సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిర్వహించే చలో హైదరాబాద్‌ను పంచాయతీ కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, ఇప్పటి వరకు పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి పంచాయతీ కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్ నర్సయ్య, గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజలింగం, రాజేందర్, బోరవ్వ, అనిత, నర్సయ్య, శంకర్, గంగన్న పాల్గొన్నారు.

వాగు పరిసరాలు పరిశీలించిన ఎస్ఐ

కన్నాపూర్ వాగు వద్దకు తాళ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి, జూలై 29 : ఇంద్రవెల్లి మండలం గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ గ్రామాలతో పాటు సిరికొండ మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన వాగు పరిసరాలను ఎస్ఐ దుబ్బాక సునీల్ సోమవారం డీడీఆర్ఎఫ్ పోలీస్ బృందంతో కలిసి పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో వాగుదాటడానికి గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ, కన్నాపూర్ వాసులకు సౌకర్యార్థం తాళ్లను ఏర్పాటు చేశారు. వాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు ప్రయాణాలు చేయవద్దని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సిరికొండ మాజీ జడ్పీటీసీ కుమ్ర రఘురాం, డీడీఆర్ఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

బోథ్, జూలై 29 : మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎనిమిది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల భాగంగా సోనాల జిల్లా పరిషత్ పాఠశాలకు ఇద్దరు, మర్రపెల్లి పాఠశాలకు ఒకరు, కన్నుట్ట పాఠశాలకు ఇద్దరు, ధన్నూర్(బీ) పాఠశాలకు ఇద్దరు చొప్పున స్కూల్ అసిస్టెంట్లుగా సోమవారం విధుల్లో చేరారు. వీరితో పాటు ధన్నూర్(బీ) మండల పరిషత్ పాఠశాల పీఎస్ హెచ్ఎంగా ఒకరు ఉద్యోగోన్నతిపై వచ్చి విధుల్లో చేరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఎదులాపురం, జూలై 29: రాష్ట్ర స్థాయి సకురా సైన్స్ ప్రోగ్రాం జపాన్ పోటీలకు బోథ్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని రసజ్ఞ ఎంపికైంది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయిలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పోటీలు నిర్వహించారు. రసజ్ఞ రాష్ట్రస్థాయిలో తన ప్రతిభను చాటింది. రాష్ట్ర స్థాయిలో ఐదు గురు విద్యార్థులను ఎంపిక చేసి జపాన్ పర్యటనకు పంపనున్నారు. అయితే తొలిసారి ఆదిలాబాద్ నుంచి బోథ్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎంపికైందని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ తెలిపారు. విద్యార్థినిని సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమేశ్‌రావ్ అభినందించారు.

31న హైదరాబాద్‌లో కార్మికుల ధర్నా

ఎదులాపురం, జూలై 29 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31వ తేదీన హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు అన్నారు. సోమవారం రానగర్ కాలనీలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రోజూ పిల్లలకు వేడివేడిగా భోజనం పెట్టే కార్మికులను వదిలి ఒక రాత్రికి సెంట్రలైజ్ కిచెన్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి, కార్మికులు రాంబాయి, శశికళ, పుష్ప, బుచ్చయ్య, సత్తెమ్మ పాల్గొన్నారు.

పాముకాటు గురైన విద్యార్థి దవాఖాన నుంచి డిశ్చార్జి

ఎదులాపురం, జూలై 29 : ఆదిలాబాద్‌లోని ఎస్టీ గురుకుల కళాశాల మొదటి విద్యార్థి జాదవ్ సిద్ధు(16) పాముకాటుకు గురై హైదరాబాద్ గాంధీ దవాఖాన నుంచి క్షేమంగా ఆదివారం రాత్రి డిశ్చార్జి అయ్యారు. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి వసతి గృహంలో కింద నిద్రించిన సమయంలో పాముకాటు వేసిన విషయం తెలిసిందే. అయితే జిల్లా కేంద్రంలో రిమ్స్‌లో చికిత్స అందించారు. అనంతరం ఆర్సీవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ అనిల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ గాంధీ దవాఖానకు ఏఎన్ఎం, సిబ్బందిని ఇచ్చి తరలించారు. దవాఖానలో ఎస్టీ గురుకులం కార్యదర్శి చొరవతో మెరుగైన వైద్యం, ప్రతి రోజూ పర్యవేక్షించారు. ఈ మేరకు చికిత్సఅందించిన తర్వాత క్షేమంగా ఆదివారం గాంధీ వైద్యులు డిశ్చార్జి చేశారని ఉమ్మడి జిల్లా ఎస్టీ గురుకులం ఆర్సీవో రాజ్యలక్ష్మి తెలిపారు.

ఆపదలో డయల్ 100కు కాల్ చేయండి

దస్తురాబాద్, జూలై 29 : అత్యవసర పరిస్థితుల్లో, ఆకతాయిలు వెంబడించిన, ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని విద్యార్థులకు ఖానాపూర్ సీఐ సైదారావు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, డయల్ 100, షీటీం, రోడ్డు నియమాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆధ్వర్యంలో సీఐ, ఎస్ఐలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్ శంకర్, హెడ్‌కానిస్టేబుల్ డ్రైవర్, కానిస్టేబుల్ సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలి

కడెం, జూలై 29: పోలీసులు ప్రజలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. సోమవారం కడెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఐ (దర్యాప్తు కేసులు) లను తగ్గించాలని, బ్లూకోర్ట్, పెట్రోకార్, డయల్ 100 ప్రాముఖ్యత గురించి వివరించారు. అనుమానిత వ్యక్తులు, సస్పెక్ట్, రౌడీషీటర్లందరినీ తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి నచ్చన్‌ఎల్లాపూర్‌లోని టీజీడబ్ల్యూఆర్‌జేఎస్ పాఠశాలలో సామాజిక దురచారాలు, ఇతర నేర సంబంధిత పరిజ్ఞానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, టీజీడబ్ల్యూఆర్‌జేఎస్ విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మాజీ ఆత్మ చైర్మన్ కుటుంబ సభ్యులకు పరామర్శ

సోన్, జూలై 29 : సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన ఆత్మ మాజీ చైర్మన్ నర్సారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం నర్సారెడ్డి కుటుంబ సభ్యులను నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, లక్ష్మణచాంద మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగన్న పరామర్శించారు. వారి వెంట నాయకులు బర్మ రాజనర్సయ్య, హరీశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి ఉన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో అవగాహన

సారంగాపూర్, జూలై 29: సారంగాపూర్, అడెల్లి గ్రామాల్లో సోమవారం తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బైంసా సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ తపాలా శాఖలో ప్రజలు డబ్బులు పొదుపు, జీవిత బీమా చేసుకోవచ్చని అన్నారు. అలాగే ఏఈపీఎస్, జీఏపీలతో పాటు డీఎస్సీ గురించి వివరించారు. అనంతరం వివిధ పొదుపు పథకాలకు సంబంధించి 350 అకౌంట్లు, పాలసీలు చేయడం జరిగింది. నిర్మల్ బ్రాంచ్ ఐపీపీబీ మేనేజర్ కళ్యాణ్, బైంసా సబ్‌డివిజన్ మేలోవర్సిర్లు నరేశ్, పవన్, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

విద్యను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సన్మానించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

ఎదులాపురం, జూలై 29 : సమాజంలో సంక్షేమం అంటే విద్య, వైద్యమేనని దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని హైదరాబాద్, ఆర్ఆర్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌లోని జడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం గురు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ.2లక్షల 91 వేల కోట్ల బడ్జెట్లో విద్య రంగానికి కేవలం రూ.4 వేల కోట్లు కేటాయించారన్నారు. ఇందులో 85 శాతం వేతనాలకే సరిపోతుందని, 15 శాతం నిధులతో ప్రైమరీ నుంచి యూనివర్సిటీ వరకు ఉన్న సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు సహజమని, కానీ విద్యార్థిని సమాజంలో మంచి పౌరుడిగా తయారు చేసేల విద్య బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు తనకు తెలుసని చెప్పారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ సమాజంలో గురుతర బాధ్యత వహిస్తూ మంచి పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఎమ్మెల్సీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవ సురేశ్, వత్త ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్, తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్‌హన్, వల్లబోజు గోపికృష్ణ, రాజుకుమార్, నారాయణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌కు ఏడుగురు ఫార్మాసిస్టులు

రిమ్స్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఫార్మాసిస్టులు

ఎదులాపురం, జూలై 29 : ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు ఏడుగురు ఫార్మాసిస్టులు సోమవారం రిపోర్ట్ చేశారు. ఇది వరకే పని చేస్తున్న ఇద్దరు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కాగా రిమ్స్‌లో ఎనిమిది మందిని కేటాయించగా ఇప్పటి వరకు ఏడుగురు డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్‌కు రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రిమ్స్‌లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీ కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సాధారణ బదిలీల్లో ఇక్కడి నుంచి ఏడుగురు వైద్యులు వెళ్లగా వారి స్థానంలో ఇద్దరు వచ్చారన్నారు. స్టాఫ్ నర్సులను కూడా రిప్లేస్ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఫార్మాసిస్టులు పూర్తి స్థాయిలో ఉన్నారని తెలిపారు. సీజనల్ కాలం కాబట్టి రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, స్టాఫ్ నర్సుతో ఒక బృందం ఏర్పాటు చేసి రోజుకు మూడు షిఫ్టుల్లో రోగులకు చికిత్స అందించేల ప్రణాళికలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్న వైద్యులతో రిమ్స్‌కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన ఫార్మాసిస్టులు రిమ్స్ డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

నేరడిగొండ, జూలై 29 : తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా పోస్టల్ సబ్‌డివిజన్ పర్యవేక్షణాధికారి సందీప్ కుమార్ అన్నారు. సోమవారం వడూర్ గ్రామంలోని రైతువేదికలో తపాలా శాఖ పథకాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారి మునీర్, గ్రామ పెద్దలు గాదె శంకర్, ఉప్పు పోశెట్టి, ముక్కార్, బీపీఎం రాజు పాల్గొన్నారు.

శిరీషకు నిర్మల్ జిల్లా పీఆర్టీయూ శాఖ మద్దతు

నిర్మల్ చైన్‌గేట్, జూలై 29: విలువలతో కూడిన విద్యను క్షేత్రస్థాయిలో అందించడంలోఒకడుగు ముందుకేసిన ఖమ్మం జిల్లాకు చెందిన శిరీషను సస్పెండ్ చేయడం ఉపాధ్యాయ లోకాన్ని భయంలోకి నెట్టివేసిందని పీఆర్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, చకాల్ర హరిప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో ఇలాంటి పరాభవాలు ఎదుర్కొవడం నిత్యకృత్యం అవుతున్న తరుణంలో శిరీషకు పీఆర్టీయూ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు కలగకుండా బోధనకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

నిర్మల్ అర్బన్, జూలై 29: టీఎస్ యూటీఎఫ్ సంఘ భవన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ అన్నారు. 2008 సంవత్సరంలో అప్పటి ఎంపీ ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్‌లోని భాగ్యనగర్ కాలనీలో సంఘానికి స్థలం కేటాయించారని దానిని సంఘంపై రిజిస్ట్రేషన్ కూడా చేయించామన్నారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బక్కన్న, నాగయ్య, రవికిరణ్, గోవర్ధన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

నిర్మల్ అర్బన్, జూలై 29 : చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహించడం అభినందనీయమని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. సోమవారం నిర్మల్‌లోని టీఎన్‌జీవో సంఘ భవనంలో వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణం రాజు, నిర్వాహకులు ధన్‌రాజ్ , డ్యాన్స్ మాస్టర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

బోథ్, జూలై 29 : మండల కేంద్రంలోని హనుమాన్ వాడలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రావుల శంకర్ ఇటీవల ధన్నూర్(బీ) ప్రాథమిక పాఠశాలకు పీఎస్ హెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొందారు. సోమవారం పాఠశాలలో విధులకు హాజరైన రావుల శంకర్‌ను ప్రధానోపాధ్యాయులు సురేశ్ వైద్య, మిత్రులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

తులం బంగారం: రూ.5వేలు నగదు చోరీ

ఎదులాపురం, జూలై 29 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో నివాసముంటున్న ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఆ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న రవీందర్ గౌడ్ ఇంటికి తాళం వేసి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని తులం బంగారం, రూ.5వేలు నగదు కనబడలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి నృత్య పోటీల్లో విద్యార్థినికి రెండో స్థానం

నిర్మల్ చైన్‌గేట్, జూలై 29: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో రెమో డిసొజా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య పోటీల్లో నిర్మల్‌కు చెందన విద్యార్థి కీర్తిశ్రీ ఫైనల్‌లో రెండో స్థానం సాధించింది. నిర్వాహకులు ఆమెను అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం

కడెంలో ర్యాలీ తీస్తున్న అటవీ శాఖ అధికారులు

కడెం, జూలై 29: మనిషి మనుగడ కోసం వన్యప్రాణులను కాపాడుకుందామని అటవీ శాఖ అధికారులు అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని కడెం, ఉడుంపూర్ రేంజ్ పరిధిలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 70 శాతం పులులు సురక్షితంగా ఉన్నాయని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అడవుల ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు అనిత, శంకర్, డీఆర్వోలు సిద్ధార్థ్, ప్రకాశ్, కవిత, కడెం, ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నిర్మల్ అర్బన్, జూలై 29 : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 47 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాద సుదర్శన్, శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, వేణుగోపాల్, మధుకర్, రాంరెడ్డి, వేణు, బాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ జేఈకి సన్మానం

పంచాయతీ రాజ్ జేఈని సన్మానిస్తున్న నాయకులు

తాంసి, జూలై 29 : తాంసి, తలమడుగు మండలాల పంచాయతీ రాజ్ జేఈగా ఐదేళ్ల పాటు విధులు నిర్వహించి మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్తున్న మజార్‌ను సన్మానించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో తాంసి మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ కన్వీనర్, మాజీ సర్పంచ్ కృష్ణ రత్న ప్రకాశ్, కప్పర్ల మాజీ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి సంతోష్, నాయకులు దేవారెడ్డి, రామన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

భైంసాటౌన్, జూలై 29 : బాసరలో పద్మనాయక వెల్మ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు అయ్యాయి. సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రొసీడింగ్ కాపీని దేగాంలోని ఆయన నివాసంలో కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్ దయాల లక్ష్మణ్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్, గంగారాయుడు, సంజీవ్‌రావు, రమేశ్‌రావు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పాఠశాలలో నాణేల ప్రదర్శన

బోథ్, జూలై 29 : బోథ్ గురుకుల పాఠశాలలో సోమవారం 40 దేశాల కరెన్సీ, నాణేలు ప్రదర్శించారు. ఆయా సందర్భాల్లో విడుదల చేసిన మహనీయుల, జయంతి, వర్ధంతిలా నాణేలు, నిజాం నాటి నాణేలు, 1905, 1910 బ్రిటిష్ వారి నాణేలు, మొగల్ పాలకుల అక్బర్(1556-1605) నాటి రాగి నాణేలు, షాజహాన్ (1628-1658) వెండి నాణేలను విద్యార్థులకు వివరించారు. చరిత్రను నాణేల ద్వారా భావితరాలకు అందించడమే తన ఉద్దేశమని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ బాశెట్టి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత చెడు మార్గాన్ని ఎంచుకోవద్దు

లోకేశ్వరం, జూలై 29 : యువత చెడు మార్గాన్ని ఎంచుకోవద్దని, మద్యపానం, గుట్కా, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన పర్స భోజన్న హత్య గురించి విచారణ చేపట్టడానికి సోమవారం హవర్గ గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ సక్రియానాయక్, ఏఎస్ఐ దిగంబర్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

కుభీర్, జూలై 29: కుభీర్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయి కుమార్, ఉపాధ్యక్షుడిగా దాసరి సాయన్న, ప్రధాన కార్యదర్శిగా బాగుల చంద్రశేఖర్ (సొనారి), సహ కార్యదర్శిగా అరుణ్‌నాయక్, కోశాధికారిగా చందాల ఎర్రన్న, అసోసియేట్ అధ్యక్షుడిగా భాస్కర్ రెడ్డి, నిర్మల్ జిల్లా ఉపాధ్యాయులుగా హరిహరనాథ్(కుభీర్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని శాలువాలతో సన్మానించారు. సమావేశంలో పీఆర్టీయూ నాయకులు హరిప్రసాద్, శంకర్, సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్

నిర్మల్ అర్బన్, జూలై 29 : దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి దొంగలను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బల్లారికి చెందిన విశ్వనాథ్, రాము పేయింటింగ్ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. కొద్ది నెలల నుంచి వీరు జల్సాలకు అలవాటు పడ్డారు. పని ద్వారా వచ్చే డబ్బులు సరిపోక పోవడంతో దొంగతనాలు చేసే వృత్తిని ఎంచుకున్నారు. ఈ క్రమంలో నిర్మల్‌లోని సత్యం లాడ్జిలో ఈ నెల 27వ తేదీన దొంగతనం చేసేందుకు వచ్చారు. రిసెప్షన్ కౌంటర్‌లోని రూ.2వేల నగదు, రిజిస్టర్ బుక్‌ను దొంగలించారు. లాడ్జి నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని విచారించగా గతంలో సైతం వీరు ఆదిలాబాద్, వరంగల్‌లోని లాడ్జిల్లో దొంగతనాలకు పాల్పడ్డట్టు తెలిపారు. వీరి వద్ద నుంచి రిజిస